సాక్షి
జగిత్యాల
శనివారం । 20 । ఏప్రిల్ । 2024



భక్తుల పుణ్య స్నానం

ధర్మపురి: పవిత్ర గోదావరినదిలో శుక్రవారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. గంగమ్మ, గౌరమ్మకు నైవేద్యాలు, తెప్పల రూపంలో మొక్కులు చెల్లించుకున్నారు.

స్వామివారికి పుష్పాలంకరణ



ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి క్షీరాభిషేకం చేసి పూలతో అలంకరించారు. లక్ష్మీహవన కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు స్వామివారలను దర్శించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0/28.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. వడగాడ్పులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిబంధనల మేరకు ధాన్యం తూకం వేయాలి



రైతుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ రాంబాబు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని సిరికొండ, దూలూర్, బొమ్మెన, తక్కళ్లపెల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించారు. కేంద్రాల్లో ధాన్యం కుప్పలు, తూకం వేసిన ధాన్యం వివరాలు తెలుసుకున్నారు. నిబంధనల మేరకు ఆరబెట్టిన ధాన్యం తూకం వేయాలని, అదనంగా తూకం వేస్తే నిర్వాహకులపై చర్యలుంటాయన్నారు. ఆయన వెంట ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

నేడు మార్కెట్‌యార్డుకు సెలవు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల మార్కెట్ యార్డుకు శనివారం సెలవు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. యార్డుకు అత్యధికంగా ధాన్యం రావడంతో అడ్తీ, ఖరీదుదారుల సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని, తిరిగి సోమవారం కొనుగోళ్లు యథావిధిగా ప్రారంభమవుతాయని, రైతులు గమనించాలని కోరారు.

పంటల పరిశీలన



నువ్వుల పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం శుక్రవారం రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో నువ్వులు, పెసర, కూరగాయల తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. నువ్వుల రకాల్లో జేసీఎస్-1020, జేసీఎస్-2454, శ్వేత రకాల్లో విత్తనోత్పత్తి ఎలా సాగుతుందని రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే చిరు సంచుల దశలో ఉన్న నల్లగింజ రకం జేసీఎస్-3287 నువ్వుల తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పద్మజ, బలరాం, రజినీదేవి, స్వాతి, శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల: విద్యార్థులు చిన్నతనం నుంచే ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు పద్ధతులు అలవర్చుకోవాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించిన వివిధ పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాసరచనలో జెడ్పీహెచ్‌ఎస్ ధరూర్ క్యాంపనకు చెందిన సురేంద్ర, స్లోగన్ రైటింగ్‌లో ఆంజనేయులు, డ్రాయింగ్ పోటీల్లో రామన్నపేటకు చెందిన వర్షిని ప్రథమస్థానం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సంపత్‌రావు, సెక్టోరియల్ అధికారి కొక్కుల రాజేశ్, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించాలి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

జగిత్యాలక్రైం: పాఠశాలల వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరి చేయించాలని జిల్లా రవాణా శాఖ అధికారి వంశీధర్ అన్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలల వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పాఠశాల వాహనానికి ఇన్సూరెన్స్, డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ ఉండేలా యాజమాన్యాలు చూసుకోవాలన్నారు. ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంవీఐలు రామారావు, వెంకన్న, ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

వలస కూలీ.. వసతుల లేమి

మామిడి మార్కెట్‌తో ఉపాధి

- పొరుగు రాష్ట్రాల నుంచి సుమారు 5 వేల మంది కూలీల రాక
- సౌకర్యాల కల్పనలో వ్యాపారుల నిర్లక్ష్యం



మామిడి మార్కెట్‌లో కాయలను గ్రేడింగ్ చేస్తున్న ఉత్తరప్రదేశ్ కూలీలు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల మండలం చల్‌గల్ మామిడి మార్కెట్ కూలీలకు ఉపాధి మార్గంగా మారింది. మామిడి సీజన్‌లో ఇక్కడ పని చేసేందుకు స్థానిక కూలీలే కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ నుంచి వస్తుంటారు. అయితే, వేల సంఖ్యలో కూలీలు వస్తుండగా.. వారితో పని చేయించుకునే వ్యాపారులు, మార్కెటింగ్ శాఖ వారు పట్టించుకోకపోవడంతో కూలీలకు కనీస వసతులు కరువయ్యాయి.

వేల సంఖ్యలో కూలీలు

మామిడి సీజన్ ఏప్రిల్, మే నెలల్లో కొనసాగుతుంటుంది. ఈ సీజన్‌లో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలో రోడ్ల వెంట వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని, రైతుల నుంచి మామిడికాయలు కొనుగోలు చేస్తుంటారు. కొనుగోలు చేసిన వాటిని ట్రాక్టర్ నుంచి దింపి, గ్రేడింగ్‌తో పాటు అట్ట పెట్టెల్లో ప్యాకింగ్ చేసి లారీల్లో లోడ్ చేసేందుకు ఎక్కువ సంఖ్యలో కూలీలు అవసరమవుతారు. దీనికి తోడు, తోటల్లో కాయలు తెంపేందుకు సైతం కూలీల అవసరం ఎక్కువ. అయితే, ఈ పనులు చేసేందుకు స్థానికంగా కూలీలు దొరక్కపోవడంతో ఇతర రాష్ట్రాల వారిని రప్పిస్తుంటారు. ఒక్కో వ్యాపారి దుకాణంలో 50 మంది వరకు పనిచేస్తుంటారు.

నెల రోజుల్లో..

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన కూలీలను మామిడికాయలు తెంపేందుకు, లోడింగ్, అన్‌లోడింగ్ చేసేందుకు వ్యాపారులు ఉపయోగించుకుంటారు. అలాగే, ఢిల్లీ, రాజస్తాన్ నుంచి వచ్చిన వారిని మామిడిని గ్రేడింగ్, ప్యాకింగ్ చేసేందుకు వినియోగించుకుంటారు. కూలీలు గ్రూపుగా ఏర్పడి ఒక్క టన్ను అన్‌లోడ్ చేస్తే రూ.250 వరకు చెల్లిస్తారు. అలాగే, గ్రేడింగ్, ప్యాకింగ్ చేసే వారికి ట్రేకు రూ.15, ప్యాకింగ్ చేసిన పెట్టెలను లారీల్లో లోడ్ చేస్తే రూ.3 వేల నుంచి రూ.5 వేలు, కాయలు తెంపడానికి వెళ్తే రూ.500 చెల్లిస్తారు. ఒక వ్యాపారి దుకాణానికి వచ్చిన కాయలను బట్టి ఒక్కో కూలీ కనీసం 30-40 రోజుల్లో రూ.30 వేల నుంచి రూ.50 వేలు సంపాదిస్తారు. ఆయా రాష్ట్రాల్లో వేసవి సీజన్‌లో పనులు లేకపోవడంతో మామిడి మార్కెట్‌లో పనుల కోసం ఇక్కడికి వస్తుంటారు. జిల్లాకు కనీసం 5 వేల నుంచి 6 వేల మంది కూలీలు రాగా, ఒక్క జగిత్యాల మామిడి మార్కెట్లోనే కనీసం 3 వేల నుంచి 4 వేల మంది ఉంటారు.

వసతులు అంతంతే..

మామిడి మార్కెట్లో కూలీల చేత పనులు చేయించేందుకు చూపుతున్న శ్రద్ధ, వారికి కనీస వసతులు కల్పించడంతో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. అసలే మండే వేసవిలో మార్కెట్ పక్కనున్న వ్యవసాయ భూముల్లో ప్లాస్టిక్ కవర్లతో గుడారాలు వేసుకుని ఉండటం, షెడ్ల కింద పడుకోవడంతో పాటు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కనున్న చెట్ల కింద సేద తీరుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఏటా వస్తాం



ఏటా మామిడి సీజన్‌లో జగిత్యాలకు వస్తుంటాం. నెల రోజుల పాటు ఇక్కడ పనిచేస్తాం. కనీసం రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తాం. మహారాష్ట్రలో పనులు లేకపోవడంతో ఉపాధి కోసం ఇక్కడకు వస్తాం.

– సేవాలాల్, మహారాష్ట్ర

ప్యాకింగ్ కోసం..



మామిడికాయలను గ్రేడింగ్ చేసి, ప్యాకింగ్ చేసేందుకు ఇక్కడకు వస్తాం. మా రాష్ట్రం నుంచి కనీసం 500 మంది వరకు వచ్చారు. మామిడి మార్కెట్లో ఏదో పని దొరుకుతుందనే ఆశతో వచ్చి, ఎంతో కొంత సంపాదించుకుని వెళ్తాం.

– గుడ్డె, ఉత్తరప్రదేశ్

కనీస వసతులు కల్పిస్తున్నాం



మామిడి మార్కెకు అన్ని రాష్ట్రాలకు సంబంధించి 4వేల నుంచి 5 వేల మంది వచ్చారు. కాయలు తెంపడం నుంచి గ్రేడింగ్ చేసి, ట్రేలలో ప్యాకింగ్ చేయడం, లారీల్లో నింపడం చేస్తుంటారు. వారికి కనీస వసతులు కల్పిస్తున్నాం.

– ఎండీ.మోయిన్, వ్యాపారుల సంఘం అధ్యక్షుడు, జగిత్యాల

రెండో రోజు ఏడు నామినేషన్లు



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రం అందజేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్, రైతులు



రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతుకు నామినేషన్ పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు

- రెండు సెట్లు దాఖలు చేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- పసుపు రైతులతో కలిసి సిట్టింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి అర్వింద్..

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

సుభాష్‌నగర్(నిజామాబాద్): నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి రెండోరోజు శుక్రవారం ఆరుగురు అభ్యర్థులు మొత్తం ఏడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ రెండు సెట్ల నామినేషన్లు వేశారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తాతో కలిసి ఒక సెట్ నామినేషన్ వేశారు. మరో సెట్ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో పాటు జగిత్యాల్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, బోధన్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి అయేషా ఫాతిమాతో కలిసి దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్, బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థి దేవతి శ్రీనివాస్, స్వతంత్ర అభ్యర్థిగా రాపెల్లి శ్రీనివాస్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా కండెల సుమన్, స్వతంత్ర అభ్యర్థిగా రాగి అనిల్ నామినేషన్ పత్రాలు సమర్పించారని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వివరించారు. కాగా రెండు రోజుల్లో మొత్తం మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

పసుపు రైతులతో కలిసి అర్వింద్..

బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పసుపు రైతులతో కలిసి మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. మెడలో పసుపు కొమ్ముల దండ, స్వయంగా కారు నడుపుతూ నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. పసుపు రైతుల సమక్షంలో, వారి ఆశీర్వాదంతో మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేశానని తెలిపారు. పసుపు రైతులు సమకూర్చి ఇచ్చిన డబ్బుతో నామినేషన్ డిపాజిట్ చెల్లించానని పేర్కొన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైతులు పండించే పసుపు, వరి, మామిడి, మొక్కజొన్న, చెరుకు, ఇతరత్రా పంటలకు విత్తనాల నుంచి మార్కెటింగ్ సౌకర్యం వరకూ అన్ని చర్యలకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయా పంటల ప్రాసెసింగ్, ప్యాకేజీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని, స్వయం ఉపాధి మహిళలకు వాల్యూయాడెడ్ సర్వీస్‌లో భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. దేశాన్ని ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా మారుస్తామని, తద్వారా యువతకు ఉపాధి పెరుగుతుందని వివరించారు. గల్ఫ్ వలసలు ఆపుతామని, అక్కడ ఉన్న వారందరికీ ఉపాధి కల్పించి వాపస్ వచ్చేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పసుపు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



కంట్రోల్‌రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, వ్యయ పరిశీలకులు సమీర్ నరైంతర్ తదితరులు

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్వీప్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఓటింగ్‌శాతం ఎక్కడైతే తక్కువగా ఉందో ఆయా ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెంచేలా చూడాలని ఆదేశించారు. ఈనెల 20 నుంచి వచ్చే నెల 11 వరకు రోజువారీ కార్యక్రమాలతో ప్రణాళిక రూపొందించి అవగాహన కల్పించాలన్నారు. వేసవి దృష్ట్యా విద్యాసంస్థలకు సెలవులు ఉన్నందున యువత తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకర, ఆర్డీవో మధుసూదన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూం పరిశీలన

కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంను పెద్దపల్లి పార్లమెంట్ వ్యయ పరిశీలకులు సమీర్ నరైంతర్ పరిశీలించారు. శుక్రవారం ఆయన జగిత్యాలకు రాగా కలెక్టర్ యాస్మిన్‌బాషా స్వాగతం పలికారు.

కేంద్ర బలగాల కవాతు



కవాతులో డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తదితరులు

కథలాపూర్(వేములవాడ): మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం కేంద్ర పోలీస్ బలగాల ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, ఎస్సైలు నవీన్‌కుమార్, కిరణ్‌కుమార్, అనిల్, కిరణ్, పోలీసులు పాల్గొన్నారు.

21 నుంచి 23 వరకు నీటి సరఫరా బంద్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ అవుట్‌గేట్ సమీపంలో ప్రధాన పైప్‌లైన్ లీకవుతున్న నేపథ్యంలో దాని మరమ్మతుకు ఈనెల 21 నుంచి 23 వరకు మంచినీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు తెలిపారు. కొత్త బస్టాండ్ వాటర్ ట్యాంక్ పరిధిలోని అరవింద్‌నగర్, పురాణిపేట, మోతెమాలవాడ, శ్రీరాంనగర్, ఎల్జీరామ్‌లాడ్జ్, వాణీనగర్, టీట్‌బజార్, తులసీనగర్, భాగ్యనగర్, అటవీశాఖ కార్యాలయం, కృష్ణానగర్, సాయిరాంనగర్, బస్‌డిపో ఏరియా, టవర్ ఏరియా, మోచీ బజార్, కరీంనగర్‌రోడ్, ఇస్లాంపుర, అంగడిబజార్ ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, ఈనెల 24 నుంచి యథావిధిగా సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

చైతన్యంతోనే కుల సంఘాలు బలోపేతం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



యాదవసంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ): ప్రజలు చైతన్యంగా ఉంటేనే కుల సంఘాలు బలోపేతమవుతాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలం పెగ్గెర్ల గ్రామంలో యాదవ సంఘం భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. సంఘ భవనం కోసం ప్రభుత్వం నుంచి రూ.4 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. అనంతరం విప్‌ను యాదవ సంఘం సభ్యులు సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు కాయితి నాగరాజు, పులి హరిప్రసాద్, పాల్తెపు గంగారాం, కారపు గంగాధర్, మార్గం శ్రీనివాస్, గంగమల్లయ్య, గంగాధర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అదనంగా తూకం వేస్తున్న విషయాలపై మండలంలోని భూషణరావుపేట, పెగ్గెర్ల గ్రామాల రైతులు విప్ ఆదికి విన్నవించారు. 40 కిలోల బస్తాకు అదనంగా కిలోన్నర, రెండు కిలోలు తూకం వేస్తేనే రైస్‌మిల్లర్లు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా విప్ జిల్లా సివిల్ సప్లయ్ అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. మిల్లర్లతోపాటు రైతులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

ఎంపీగా అర్వింద్ చేసిన అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న విప్ లక్ష్మణ్‌కుమార్

- ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

కోరుట్ల: నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అర్వింద్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జువ్వాడి భవన్‌లో మాట్లాడారు. బీజేపీ నాయకులు దేవుడి పేర్లు చెప్పి ఓట్లు అడుక్కోవడం తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. తాము కూడా రోజూ దేవుని పూజ చేస్తామన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే కొన్ని అమలు చేశామని మరి కొద్ది రోజుల్లోనే పూర్తి హామీలు అమలు చేస్తామన్నారు. నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఈ ప్రాంత సమస్యలపై పూర్తి పట్టున్న వ్యక్తి అని, అతడిని గెలిపిస్తే ఈ ప్రాంత ప్రజలకు పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. ఈ నెల 21న జీవన్‌రెడ్డి నిజామాబాద్‌లో నామినేషన్ వేస్తారని కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, నాయకులు కొమిరెడ్డి కరమ్, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, జువ్వాడి కృష్ణారావు, పట్టణ, మండల అధ్యక్షులు గంగాధర్ గౌడ్, రాజం తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలి



విద్యుత్ ఉద్యోగులతో సీజీఎం ప్రభాకర్

జగిత్యాలజోన్: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఎన్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో విద్యుత్ ఉద్యోగులకు నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా శుక్రవారం వరంగల్ హెచ్‌ఆర్‌డీ చీఫ్ జనరల్ మేనేజర్ ప్రభాకర్ పాల్గొని ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ సంస్థ అభివృద్ధి కోసం సంస్థలో పనిచేస్తున్న ఆపరేషన్స్, మెయింటనెన్స్ విద్యుత్ సిబ్బందికి, జూనియర్ లైన్‌మెన్ నుంచి ఫోర్‌మెన్ క్యాడర్ వరకు అంతర్గత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ లైన్ పనులు చేస్తున్నప్పుడు స్పాట్ ఎర్తింగ్ చేసుకుని ప్రమాదాలు జరగకుండా పనులు చేయాలని సూచించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తూ సంస్థకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ సత్యనారాయణ, డీఈలు గంగారాం, రవీందర్, ఏడీఈ లు నగేశ్‌కుమార్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని గల ఓ రెస్టారెంట్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ నిర్వహించారు. కాలం చెల్లిన వస్తువులు, పురుగులు పట్టిన బియ్యం, పప్పులు, తదితర వస్తువులను గుర్తించి హోటల్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష మాట్లాడుతూ, ఫిర్యాదు మేరకు హోటల్‌లో తనిఖీలు నిర్వహించామని, కాలం చెల్లిన వస్తువులతోపాటు, హోటల్‌లో శుభ్రత లేదని తెలిపారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం



కమ్మరిపేటలో తడిసిన ధాన్యం



భూషణరావుపేటలో కవర్లపై వర్షపునీరు



బీమారంలో నీటిని ఎత్తిపోస్తున్న మహిళా రైతు

కథలాపూర్/మేడిపల్లి: అకాల వర్షంతో రైతులు ఇబ్బందిపడ్డారు. శుక్రవారం సాయంత్రం మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లో ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పలు చోట్ల ధాన్యం తడిసింది. వర్షం కురియగానే కొందరు రైతులు కొనుగోలు కేంద్రాలకు పరుగెత్తారు. ఇళ్లలో ఉన్న రైతులు పరుగెత్తి ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పారు. అప్పటికే కొందరి ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. కుప్పలపై కప్పిన టార్పాలిన్ కవర్లపై వాననీరు నిల్వడంతో రైతులు వాటిని పారబోశారు.

క్లుప్తంగా

ఎప్‌సెట్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

- స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బట్టు మల్లయ్య



మాట్లాడుతున్న డైరెక్టర్ మల్లయ్య

కరీంనగర్: నగరంలోని సప్తగిరికాలనీ కేజీబీవీలో నిర్వహిస్తున్న ఎప్‌సెట్ ప్రత్యేక శిక్షణ తరగతులను స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బట్టు మల్లయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్న ఎప్‌సెట్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సబ్జెక్టులకు సంబంధించిన అనుమానాలను శిక్షకులను అడిగి, నివృత్తి చేసుకుంటూ, కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించాలన్నారు. కేజీబీవీల్లో చదివేవారు చాలా పేదరికం నుంచి వస్తారని, వారికి ఇబ్బందులు కలగకుండా మన సొంత పిల్లల్లా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, జిల్లా జెండర్ అండ్ ఈక్విటీ కో–ఆర్డినేటర్ డాక్టర్ డెబోరా కృపారాణి, కేజీబీవీ ప్రత్యేక అధికారి పుష్పరాణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ



రోడ్డుపై పడిన ధాన్యం

సుల్తానాబాద్‌రూరల్: కాట్నపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై ధాన్యం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓ లారీ వెనుక నుంచి ఢీకొంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గర్రెపల్లిలోని ఐకేపీ కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం లోడ్‌తో ట్రాక్టర్ సుల్తానాబాద్‌కు వస్తోంది. ఈక్రమంలో కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తాపడగా డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అయితే, అందులో ధాన్యం రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయింది. దాదాపు గంటకుపైగానే వాహనాలు నిలిచి ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వేంకటేశ్వరస్వామి ఫొటోలు ధ్వంసం

- జగదేవుపేట ఆలయంలో దుండగుల దుశ్చర్య



పంట పొలాల్లో స్వామివారి ఫొటో

వెల్గటూర్ (ధర్మపురి): మండలంలోని జగదేవుపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో దుండగులు ప్రవేశించి, స్వామివారి ఫొటోలు, పూజా సామగ్రి ధ్వంసం చేశారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి వెళ్లి, స్వామివారి ఫొటోలు, కలశం, ఆలయ ప్రాంగణంలోని తులసి గద్దెను పక్కనున్న కాలువలో, పంట పొలాల్లో పడేశారు. ఈ ఘటనపై ఆలయ కమిటీవారు, దీక్షా స్వాములు శుక్రవారం ఉదయం వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ఉమాసాగర్ ఆలయాన్ని సందర్శించి, వివరాలు సేకరించారు. గ్రామానికి చెందిన కొందరు అన్యమతస్తులే ఇలా చేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దమ్ముంటే కాంగ్రెస్‌ను టచ్ చేయండి

- బీఆర్ఎస్ అభ్యర్థులే ఆ పార్టీని వీడుతున్నరు..
- రాష్ట్ర విభజన హామీలేవీ బీజేపీ నెరవేర్చలేదు..
- ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారు..
- మంత్రి పొన్నం ప్రభాకర్



సిరిసిల్లలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్లటౌన్/కరీంనగర్ కార్పొరేషన్: అధికారం నుంచి ప్రజలు తిరస్కరించినా కేసీఆర్, కేటీఆర్‌లకు అహం పోలేదని, తమ ప్రభుత్వాన్ని కూల్చుతామంటుండ్రని.. దమ్ముంటే కాంగ్రెస్‌ను టచ్ చేయండని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. సిరిసిల్లలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థులుగా నిలబెట్టిన వారే ఆ పార్టీ అవినీతి, నియంతృత్వంపై ఛీత్కరించుకుంటూ పార్టీని వీడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజాపాలన అందించే కాంగ్రెస్‌పైనే ప్రజల ఆశీర్వాదం ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలేవీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నెరవేర్చలేదన్నారు. ప్రజాస్వామ్య విలువలు తెలువనోళ్లు రాజకీయం చేస్తే.. ఇట్లనే ఉంటుందని బీఆర్ఎస్, బీజేపీలను ఉద్దేశించి విమర్శించారు. ఆ పార్టీల నియంతృత్వంపై ప్రజలు విసిగిపోయారని, రాహుల్ నేతృత్వంలో అందించే ప్రజాపాలనకే రానున్న ఎన్నికల్లో ప్రజలు పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటై సిరిసిల్లకు కేటాయించిన మెగా టెక్స్‌టైల్ క్లస్టర్‌ను వరంగల్‌కు తరలించి ఇక్కడి కార్మికుల ఉసురు పోసుకున్నారని ధ్వజమెత్తారు. కరీంనగర్ నుంచి పార్టీ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, స్థానిక నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కూడబల్కొనే బీజేపీ, బీఆర్ఎస్ వ్యాఖ్యలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వం కూలిపోతుందని బీఆర్ఎస్, బీజేపీ కూడబల్కొని చెబుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో మాట్లాడారు. 20 మంది ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. కేసీఆర్ అసహనంతో, పిచ్చిపట్టి మాట్లాడుతున్నారన్నారు. రైతుల సమస్యలు, ప్రభుత్వం కూలిపోవడం, రేవంత్‌రెడ్డి బీజేపీతో కలవడం..ఏ అంశమైనా ఈ రెండు పార్టీలు ఒకే మాట మాట్లాడుతున్నాయని, కుమ్మక్కుకు ఇదే నిదర్శనమన్నారు. ఉత్తర భారత్‌లో బలంగా ఉన్నామనుకొన్న బీజేపీ కోటలకు బీటలువారుతున్నాయని, అందుకే దక్షిణ భారత్ మీద అమిత్‌షా దృష్టి పెట్టారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనులు పూర్తి చేసి ఇవ్వాల్సిన టోకెన్ బిల్లులు రూ.40 వేల కోట్ల నుంచి రూ.50 వేల కోట్లున్నాయన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలను సంతృప్తి పరచడానికి వందల జీవోలు తెచ్చారని పేర్కొన్నారు.

ఆరోగ్య క్రమశిక్షణతో అవయవాలు భద్రం

- మేయర్ వై.సునీల్‌రావు
- మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వరల్డ్ లివర్ డే



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌టౌన్: మనిషి ఆరోగ్య క్రమశిక్షణ పాటిస్తే అన్ని అవయవాలు భద్రంగా ఉండి, ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. వరల్డ్ లివర్ డే సందర్భంగా శుక్రవారం కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఆహారం మితంగా తీసుకుంటూ ప్రతీరోజు ఒక గంట వ్యాయామం చేయాలన్నారు. ముఖ్యంగా లివర్ పనితీరును బట్టే శరీరంలోని జీవ, జీర్ణక్రియలు సక్రమంగా జరుగుతాయని పేర్కొన్నారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ప్రజల ఆరోగ్యం కోసం తమ వంతు బాధ్యతగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ప్రణీత్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. మానవ శరీరంలో గుండె, మెదడు తర్వాత అతి ముఖ్యమైన అవయవం లివర్ అని తెలిపారు. అతిగా ఆల్కహాల్ సేవించడం వల్ల అది దెబ్బతింటుందని, ఆల్కహాల్ మానాలని సూచించారు. ఆస్పత్రి సిబ్బందికి జుంబా డ్యాన్స్‌పై శిక్షణతోపాటు ప్రదర్శన నిర్వహించారు. హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేచినేని వనజ, మేచినేని పవన్‌రావు, వైద్యులు వినయ్‌కుమార్, ఉపేందర్‌రెడ్డి, రవిమల్లారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కర్ణాకర్, ఆపరేషన్స్ మేనేజర్ సాయిచరణ్ పాల్గొన్నారు.

ఆరుగురు ఆర్టీసీ ఉద్యోగుల సరెండర్!

- ఆర్ఎం ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించినట్లు సమాచారం
- ఏసీబీకి చిక్కిన హుజూరాబాద్ డీఎంకు సహకరించడమే కారణం?

హుజూరాబాద్: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో విధులు నిర్వహించే ఆరుగురు ఉద్యోగులను ఆర్ఎం కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో వారు శుక్రవారం ఆర్ఎం ఆఫీస్‌లో రిపోర్టు చేసినట్లు సమాచారం. ఇటీవల ఓ ఆర్టీసీ డ్రైవర్ వద్ద హుజూరాబాద్ డిపో మేనేజర్ సామల శ్రీకాంత్ రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం విదితమే. ఈ క్రమంలో డిపోలో విజిలెన్స్ అధికారులు రెండు రోజులపాటు విచారణ చేపట్టారు. ఇందులో డీఎం శ్రీకాంత్ అవినీతి అక్రమాలకు సహకరించినట్లు తేలిన డిపో పరిధిలోని ఆరుగురు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. డీఎం శ్రీకాంత్ చిన్న చిన్న కారణాలు చూపుతూ, అనుమతి లేకుండా అత్యవసరంగా సెలవులు తీసుకున్న ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసి, డబ్బులు డిమాండ్ చేయడం, ఇవ్వని పక్షంలో పలువురికి చార్జీ మెమోలు ఇచ్చినట్లు తేల్చారని సమాచారం. వాటిని విజిలెన్స్ అధికారులు సీజ్ చేసి, కరీంనగర్ ఆర్ఎం కార్యాలయానికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

ఇన్‌చార్జి డీఎంగా వెంకటేశ్వర్లు..

హుజూరాబాద్ ఇన్‌చార్జి డీఎంగా హుస్నాబాద్ డీఎం వెంకటేశ్వర్లును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

తనిఖీల్లో భారీగా నగదు పట్టివేత



నగదు చూపుతున్న కరీంనగర్ పోలీసులు



వేములవాడలో..

కరీంనగర్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు కరీంనగర్ నగరంలోని వివిధ ఠాణాల పరిధిలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. రూ.15.82 లక్షలు పట్టుకున్నట్లు తెలిపారు. బడింది. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్ వన్ టౌన్ పరిధిలోని రాజీవ్ చౌక్‌లో కరీంనగర్ దుర్గమ్మగడ్డకు చెందిన జనగం సుమన్ కల్యాణ్ వద్ద రూ.7 లక్షలు, కరీంనగర్ టూ టౌన్ పరిధిలోని గీతాభవన్ చౌరస్తా వద్ద మానకొండూర్‌కు చెందిన నెల్లి భాస్కర్ వద్ద రూ.1,11,900, ఐబీ చౌరస్తా వద్ద కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌కు చెందిన కోల ప్రదీప్‌కుమార్ వద్ద రూ.5,70,900, కరీంనగర్ త్రీ టౌన్ పరిధిలో కట్టరాంపూర్‌కు చెందిన గాండ్ల సురేశ్ వద్ద రూ.2 లక్షలు స్వాధీనం చేసుకొని, సీజ్ చేశారు.

వేములవాడలో రూ.5.67 లక్షలు..

వేములవాడ: పట్టణ పరిధిలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం శుక్రవారం ఓ వ్యక్తి వద్ద రూ.5.67 లక్షలు పట్టుకుంది. వ్యాపార లావాదేవీల్లో భాగంగా బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళ్తున్నట్లు అతను తెలిపాడన్నారు. కానీ, సంబంధిత ఆధారాలు చూపించకపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అందజేశామన్నారు. ఏఈఈ వెంకటరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ భిక్షపతి, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులున్నారు.

అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద రూ.93 వేలు..

మెట్‌పల్లిరూరల్: బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయ సమీపంలోని అంతర్‌జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఇబ్రహీంపట్నం పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఓ కారులో తరలిస్తున్న రూ.93 వేలను పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. సంబంధిత ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి, జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించామన్నారు.

రాయపట్నం చెక్‌పోస్టు వద్ద రూ.2 లక్షలు..

ధర్మపురి: రాయపట్నం చెక్‌పోస్టు వద్ద రూ.2 లక్షలు పట్టుకున్నట్లు ధర్మపురి పోలీసులు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాయపట్నం వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఆ సమయంలో ఓ వ్యక్తి ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యల నిమిత్తం డబ్బులను సంబంధిత అధికారులకు పంపించినట్లు తెలిపారు. సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

మేడిపల్లి(జగిత్యాల): మండలంలోని దమ్మన్నపేటవాసి నిమ్మ రాజశేఖర్ ఈ నెల 3న సౌదీ అరేబియాలో గుండెపోటుతో మృతి చెందగా ఆయన మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరింది. ఉపాధి కోసం వెళ్లి, విగతజీవుడై రావడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు. రాజశేఖర్‌ది నిరుపేద కుటుంబం. ఇద్దరు ఆడపిల్లలున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సోషల్ వెల్ఫేర్ స్కూల్లో ఫుడ్ పాయిజన్

- 20 మంది విద్యార్థులకు అస్వస్థత

సుల్తానాబాద్: సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కావడంతో 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్ ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో శుక్రవారం ఉదయం టిఫిన్ చేసిన విద్యార్థులకు వాంతులు, విరేచనాలయ్యాయి. సిబ్బంది వెంటనే వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నలుగురు నలుగురు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో సెలైన్ ఎక్కించారు. మిగిలిన వారి ఆరోగ్యం సాయంత్రం వరకు కుదుటపడటంతో హాస్టల్‌కు తరలించినట్లు డాక్టర్ వెంకటేశ్ తెలిపారు. అల్పాహారంలో ఆయిల్ ఎక్కువ వాడటం వల్ల పిల్లలు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు. హాస్టల్‌కు పంపించిన పిల్లలకు స్టాఫ్ నర్స్ ఆధ్వర్యంలో కొబ్బరి బోండాలు, గ్లూకోజ్ అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యప్రసాద్ రాజు పేర్కొన్నారు.

పిడుగు పడి ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న రమేశ్

మెట్‌పల్లిరూరల్: మండలంలోని ఆత్మకూర్‌లో పిడుగు పడి, ఒకరికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. ఆత్మకూర్‌కు చెందిన కోరుట్ల రమేశ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండటంతోపాటు ఖాళీగా ఉన్న సమయంలో కూలీ పనులకు వెళ్తున్నాడు. శుక్రవారం సాయంత్రం గాలిదుమారం వచ్చి, ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో అతను గ్రామంలో చెట్టు కింద ఆగాడు. అదే సమయంలో పిడుగు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు హుటాహుటిన మెట్‌పల్లిలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్లిన దొంగను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ రఘుపతి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఈ నెల 10న సిరిసిల్ల పాత బస్టాండ్ ఏరియాలోని బార్ అండ్ రెస్టారెంట్ ఎదుట నిలిపిన, సినారె గ్రంథాలయం ఎదుట పార్కింగ్ చేసిన బైకులు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సిరిసిల్ల పట్టణం వెంకంపేటలో ఉండే చెందిన కోల రవిగౌడ్‌ను దొంగగా తేల్చారు. ఇతను కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం పరీద్‌పేటకు చెందినవాడని, ఉపాధి నిమిత్తం సిరిసిల్లలో ఉంటున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఎత్తుకెళ్లిన వాహనాల్లో ఒకటి పొదల్లో దాచిపెట్టాడని, మరోదానిపై సిరిసిల్ల బైపాస్ రోడ్డుమీదుగా వెళ్తుంటే పట్టుకున్నామని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది విధుల బహిష్కరణ



పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి వెంటనే వేతనాలను ఇప్పించాలంటూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, కేవీపీఎస్ నాయకులు అశోక్, రవీందర్ డిమాండ్ చేశారు. వీరి ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది విధులు బహిష్కరించారు. శానిటేషన్, పేషంట్‌కేర్, సెక్యూరిటీ తదితర విభాగాల్లో పని చేసే కార్మికులకు ఏడాదిగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి కార్మికుల సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరారు.

ఒలింపియాడ్‌లో ‘పారమిత’ ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కొత్తపల్లి(కరీంనగర్): ఇటీవల నిర్వహించిన ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్(ఐటీవో)లో కొత్తపల్లి మండలంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. రాష్ట్రస్థాయిలో గణితంలో వెల్ది హర్షిణి(ఏడోతరగతి) 4వ ర్యాంకు, అర్హాన్ లతీఫ్ (ఎనిమిదో తరగతి) 4వ ర్యాంకు, సామాన్యశాస్త్ర విభాగంలో ఎస్.రుషిక(తొమ్మిదో తరగతి) 7వ ర్యాంకు సాధించి, పతకాలు, బహుమతులు గెలుపొందారని హెచ్‌ఎం రితేశ్ మెహతా తెలిపారు. మరో ఐదుగురు విద్యార్థులు స్ఫూర్తి(గణితం), జి.సహస్ర, ఎస్.సిరి(సామాన్య శాస్త్రం), యశ్మిత్ పటేల్, రిధి పబ్బతి(ఆంగ్లం) మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్ సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు శుక్రవారం అభినందించారు. డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, రాకేశ్, వి.యు.ఎం.ప్రసాద్, వినోద్‌రావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, కో–ఆర్డినేటర్ రాము, గైడ్ టీచర్లు ప్రదీప్ కుమార్, చంద్రమౌళి శర్మ, హరీశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగ్గురు ‘ఉపాధి’ కూలీలకు గాయాలు







ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బుర్ర స్వరూప, ఆవునూరి తార, కాల్వల లింగమ్మ



సంఘటన స్థలంలో బండరాయి

సుల్తానాబాద్‌రూరల్/సుల్తానాబాద్(పెద్దపల్లి): ఉపాధిహామీ ద్వారా సుద్దాల పెద్దమ్మకుంటలో శుక్రవారం పూడికతీస్తున్న కూలీలపై బండరాయి దొర్లి, మట్టిపెళ్లలు పడ్డాయి. ఈఘటనలో ముగ్గురు మహిళా కూలీలకు గాయాలయ్యాయి. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, స్థానికుల కథనం ప్రకారం.. పెద్దమ్మకుంట పూడికతీత పనుల్లో 163 మంది కూలీలు పనిచేస్తున్నారు. అందులో 20 మంది ఒక బృందంగా ఏర్పడి పూడిక తీస్తుండగా గట్టు కుంగి దానిపై ఉన్న బండరాయి కిందకు జారిపడింది. ఆ క్రమంలోనే మట్టిపెళ్లలు తగిలి అక్కడ పనిచేస్తున్న మహిళా కూలీలు ఆవునూరి తార, కల్వల లింగమ్మ, బుర్ర స్వరూపకు గాయాలయ్యాయి. తోటికూలీలు వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఈజీఎస్ ఏపీడీ సత్యనారాయణ ఆస్పత్రికి వెళ్లి కూలీలను పరామర్శించారు.

నీటితొట్టెలో పడి బాలుడి మృతి



పరమేశ్వర్ మృతదేహం

మేడిపల్లి(జగిత్యాల): ఓ బాలుడు నీటితొట్టెలో పడి మృతిచెందిన ఘటన మేడిపల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని బేల గ్రామానికి చెందిన బైగాని సాంబారి ఉపాధి నిమిత్తం తన ఇద్దరు పిల్లలను తీసుకొని, 4 నెలల క్రితం మేడిపల్లికి వచ్చింది. స్థానిక ఇటుకల బట్టీలో పని చేస్తోంది. ఆమె కుమారుడు పరమేశ్వర్(7) గురువారం రాత్రి సమయంలో తోటి పిల్లలతో ఆడుకుంటూ వెళ్లి, దగ్గరలో ఉన్న నీటితొట్టెలో పడిపోయాడు. మిగతా పిల్లలు ఈ విషయాన్ని స్థానికులకు చెప్పడంతో వచ్చి, పరమేశ్వర్‌ని బయటకు తీసి, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆ బాలుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి సాంబారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నెల రోజుల్లో ముగ్గురు..

నెల రోజుల్లో ఒక వలస కార్మికుడు, ఇద్దరు కార్మికుల పిల్లలు మృతిచెందారు. దీంతో వలస కార్మికులకు రక్షణ చర్యలు కరువయ్యాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.


వ్యవసాయ బావిలో పడి వృద్ధురాలు..

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓదెల గ్రామానికి చెందిన చింతం లక్ష్మి(74) వ్యవసాయబావిలో పడి మృతిచెందింది. ఏఎస్సై లక్ష్మీరాజం తెలిపిన వివరాల ప్రకారం.. ఓదెల గ్రామానికి చెందిన చింతం లక్ష్మి రెండు సంవత్సరాల నుంచి కీళ్లనొప్పులతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. శుక్రవారం బహిర్భూమికి వెళ్లి బావిలో పడి మృతిచెందింది. మృతురాలి కుమారుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కొత్తపల్లి(కరీంనగర్): బైక్‌ను మరో బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండలంలోని చింతకుంట శాంతినగర్‌కు చెందిన తాకు విశాల్ శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై కమాన్‌పూర్ పెట్రోల్ బంకుకు వెళ్లాడు. పెట్రోల్ కొట్టించుకొని, తిరిగి వస్తూ డివైడర్ దాటుతుండగా భూమి రాకేశ్ బైక్‌పై వేగంగా వచ్చి, ఢీకొట్టాడు. ఈ ఘటనలో విశాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తల్లి కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అప్పుల బాధతో గొర్రెల కాపరి ఆత్మహత్య



మల్లయ్య (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అప్పుల బాధతో ఓ గొర్రెల కాపరి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డిపేట మండలంలోని రాగట్లపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై రమాకాంత్, గ్రామస్తుల వివరాల ప్రకారం.. రాగట్లపల్లికి చెందిన నెత్తెట్ల చిన్న మల్లయ్య(48) ఇల్లు నిర్మించుకునేందుకు, భూమిని అభివృద్ధి చేయడం కోసం సుమారు రూ.20 లక్షల వరకు అప్పులు చేశాడు. వ్యవసాయం, గొర్రెల పెంపకం ద్వారా ఆదాయం అంతంత మాత్రంగానే వస్తుండటంతో అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య సత్తవ్వ, కుమారుడు అజయ్, కూతురు అమ్ములు ఉన్నారు. మల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ దాసరి సుజాత, గ్రామస్తులు కోరారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కింద పడి బాలిక బలవన్మరణం

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామ శివారులోని రైల్వే బ్రిడ్జిపై ఒడిశా రాష్ట్రానికి చెందిన కైకేయి(15) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందని ఎస్సై సదాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన మన్మద తన కుటుంబ సభ్యులతో కలిసి చల్‌గల్ శివారులోని ఇటుక బట్టీల్లో పని చేస్తోంది. గురువారం జగిత్యాల మార్కెట్‌కు వచ్చి, సాయంత్రం తిరిగి వెళ్తున్నప్పుడు కైకేయి అదృశ్యమైంది. రాత్రి ఆమె కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కొన్ని రోజులుగా కైకేయి మానసిక పరిస్థితి సరిగా ఉండటం లేదని కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం రైల్వేట్రాక్‌పై ఆమె మృతదేహం ఉందన్న సమాచారంతో ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు. మృతురాలి తల్లి మన్మద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి పేర్కొన్నారు.

47 పెండింగ్ చలాన్ల వాహనం పట్టివేత

- రూ.12,805 చెల్లించిన యజమాని

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల వద్ద జగిత్యాల పట్టణ సీఐ వేణుగోపాల్, ఎస్సై మన్మదరావు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రాయికల్ మండలంలోని కిష్టంపేటకు చెందిన జనార్దన్ తన బైక్‌పై వస్తుండగా ఆపారు. ఆ వాహనంపై 47 పెండింగ్ చలాన్లు ఉన్నట్లు గుర్తించి, సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో యజమాని జనార్దన్ మొత్తం రూ.12,805 చెల్లించి, సంబంధిత రసీదును పోలీసులకు అందజేయడంతో వాహనాన్ని అప్పగించారు.